


శనివారం 25 జూలై 2026 పేజీలు : 8

## ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలను ప్రోత్సహించాలి

విద్యార్థులకు ఆగస్టు నెలాఖరులోగా ఏకరూప దుస్తులు అందించాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



## ప్రధాన రహదారిపై శిథిలావస్థకు చేరిన

# వాగు వంతెన

ప్రమాదాలకు నిలయంగా మారిన వంతెన..
ఆందోళనలో వాహనదారులు

**రాయికోడ్ జూలై 24 (ప్రజా జ్యోతి):**

మండల కేంద్రమైన రాయికోడ్ గ్రామంలో ప్రధాన రహదారిపై ఉన్న వాగు వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు, వాహనదారులు

- మిగతా3లో












## సంగారెడ్డిలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సంబరాలు



**సంగారెడ్డి (ప్రజా జ్యోతి):**

సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు,- మిగతా3లో

## ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రియాశీలకంగా వ్యవహరించాలి

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:జూలై 24:-**

జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రియా శీలకంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ పాండుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ సగటున 74 శాతం పూర్తయిందని తెలిపారు. నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణతో అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఓటరు జాబితాలో గుర్తించిన అనామలీస్ (వ్యత్యాసాలు) ఉన్న సందర్భాల్లో సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నోటీసులో పేర్కొన్న - మిగతా3లో



# ప్రధాన రహదారిపై శిథిలావస్థకు చేరిన వాగు వంతెన

-మొదటిపేజీ తరువాయి
భయాందోళనకు గురవుతున్నారు.

**కూలిపోయిన రక్షణ గోడలు**

వంతెన ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పలుచోట్ల పూర్తిగా కూలిపోయాయి.కొన్ని చోట్ల సిమెంట్ స్తంభాలు విరిగి,ఇనుప రాడ్లు బయటకు కనిపిస్తున్నాయి.దీంతో వంతెనపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారింది.

**గుంతలమయమైన రహదారి**

వంతెనకు ఇరువైపులా ఉన్న రహదారి గుంతలతో నిండిపోయింది. భారీ వాహనాలు వెళ్లే సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వేలాది వాహనాల రాకపోకలు**

ఈ రహదారి ద్వారా నారాయణఖేడ్,మెదక్,నిజామాబాద్ తదితర ప్రాంతాలకు నిత్యం వేల సంఖ్యలో కార్లు,లారీలు,బస్సులు,ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.ఇంత రద్దీగా ఉండే రహదారిపై వంతెన శిథిలావస్థకు చేరడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

**రాత్రి వేళల్లో మరింత ప్రమాదం**

వంతెనపై సరైన హెచ్చరిక బోర్డులు,రిఫ్లెక్టర్లు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

**అధికారులు వెంటనే స్పందించాలి**

ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ వంతెనను సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలించి,మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.అవసరమైతే కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వాహనదారులు,గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# సంగారెడ్డిలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

-మొదటిపేజీ తరువాయి



పార్టీ కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి కేటీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేసీఆర్ నాయకత్వం, కేటీఆర్ కృషి చిరస్మరణీయమని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇప్పటికీ కేసీఆర్ సేవలు అవసరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రజలు హామీల అమలు కోరితే అసత్య ఆరోపణలు చేస్తూ డైవర్ట్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని మండిపడ్డారు.



కేటీఆర్, హరీశ్‌రావు రాష్ట్ర ప్రజల సమస్యలపై నిరంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజా గొంతుకగా నిలుస్తున్నారని అన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రజా సమస్యలను పక్కనబెట్టి హైడ్రామాలు చేస్తున్నారని, సంగారెడ్డి బైపాస్ రోడ్డు వంటి కీలక సమస్యలను పరిష్కరించకుండా ప్రచారాలకే పరిమితమవుతున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

చింత సాయినాథ్ మాట్లాడుతూ, సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల తరఫున కేటీఆర్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ దశ, దిశను మార్చిన కేసీఆర్ నాయకత్వంలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని, ముఖ్యంగా మున్సిపల్ శాఖ మంత్రిగా రాష్ట్రంలోని పట్టణాల సమగ్ర అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ, అభివృద్ధి, పరిపాలనలో తనదైన ముద్ర వేసిన నాయకుడు కేటీఆర్ అని అన్నారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ నినాదాలు చేశారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా జన్మదిన వేడుకల్లో పాల్గొని కేటీఆర్ గారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీహరి, చింత గోపాల్, కొండల్ రెడ్డి, నాగరాజు గౌడ్, రామప్ప, మల్ల గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, మధుసూదన్ రెడ్డి, విఠల్, పెద్దగొల్ల ఆంజనేయులు, నాయకులు వేణుగోపాల స్వామి, కౌన్సిలర్లు లాడె మల్లేశం, పొన్న రాజేందర్ రెడ్డి, నవీన్, దశరథ్ రెడ్డి, జాఫర్, సురేష్, నాయకులు శ్రీధర్ రెడ్డి, లాడె బాలు, విష్ణువర్ధన్, ఆంజనేయులు, వెంకటేష్ గౌడ్, బీఆర్ఎస్వీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రానున్నది మన ప్రభుత్వమే : హరీశ్ రావు



మనోహరాబాద్ జూలై 24( ప్రజా జ్యోతి ) ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవలు అందించాలని రానున్నది మన ప్రభుత్వమేనని మాజీ మంత్రి , సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. మనోహరాబాద్ మండల బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆయన నివాసం లో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ఆయనను కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర నాయకులు ర్యాకల శేఖర్ గౌడ్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు పురం మహేష్ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యులు రాజు యాదవ్ , దుర్గేష్ యాదవ్, ఎస్సీ సెల్ నాయకులు శివకుమార్, దండుపల్లి మాజీ ఉప సర్పంచ్ మహేందర్ గౌడ్, నరేందర్ గౌడ్ , పురం ప్రభాకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రియాశీలకంగా వ్యవహరించాలి

-మొదటిపేజీ తరువాయి
సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించడం ద్వారా తమ ఓటు హక్కును కొనసాగించుకోవచ్చని తెలిపారు. ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లను గుర్తించి, బూత్ స్థాయి అధికారుల ద్వారా ఫారాలు సేకరించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా డిజిటలైజేషన్ పురోగతి వివరాలను వెల్లడిస్తూ, నారాయణఖేడ్ -- 87 శాతం, ఆందోల్ -- 83 శాతం, జహీరాబాద్ -- 78 శాతం, సంగారెడ్డి -- 74 శాతం, పటాన్‌చెరు -- 58 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. తమ పరిశీలనలో గుర్తించిన పలు అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, ఈఆర్‌వోలు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చీకుర్తి ప్రభుత్వ బడిలో 20 మంది చేరిక



జహీరాబాద్, జూలై 24( ప్రజా జ్యోతి న్యూస్ ) ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంపొందించే దిశగా చీకుర్తి గ్రామంలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 20 మంది విద్యార్థులను ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చేర్పించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ముందుండి సహకరించారు. ప్రభుత్వ విద్యపై నమ్మకాన్ని చాటుతూ, హైదరాబాద్‌లో చదివే అవకాశం ఉన్నప్పటికీ తన కుమారుడిని కూడా చీకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలను ప్రోత్సహించాలి

సంగారెడ్డి ప్రజా జ్యోతి జూలై 24:,-ఎల్‌నినో ప్రభావంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టించి ఆగస్టు నెలాఖరులోగా అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఏకరూప దుస్తుల పంపిణీ, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం పరిస్థితులు, ఖరీఫ్ పంటల సాగు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులను ఆగస్టు నెలాఖరులోగా అందజేయాలని సూచించారు. అలాగే ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు మండలాల వారీగా విత్తన మేళాలను నిర్వహించి రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు యూనిఫాంల కుట్టింపునకు అవసరమైన వస్త్రాలు, ఇతర సామగ్రిని సకాలంలో అందజేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏకరూప దుస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య, అవసరమైన యూనిఫాంల వివరాలను అధికారులతో చర్చించారు. జిల్లాలో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా ఆరుతడి పంటలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. క్రాప్ డైవర్సిఫికేషన్‌కు అవసరమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక అమలు చేసి, రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పై ఓటర్లకు అవగాహన కల్పించిన తెలంగాణ రాష్ట్రసెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్‌రెడ్డి



జహీరాబాద్, జూలై 24 ( ప్రజా జ్యోతి న్యూస్ ) హైదరాబాద్ అంబర్‌పేట నియోజకవర్గంలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై స్థానిక ప్రజలకు, ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, ఎస్ఐఆర్ ప్రాముఖ్యతను మరియు ఓటు హక్కు నమోదు విధానాన్ని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని, జాబితాలోని తప్పుల సవరణ, బీఎల్ఓల సమన్వయంతో పూర్తి వివరాలను సరిచూసు కోవాలని ఓటర్లకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలక మైనదని, నియోజక వర్గంలోని ప్రతి అర్హుడైన పౌరుడు ఎస్ఐఆర్ ప్రక్రియను ఉపయోగించు కుని తమ ఓటును సురక్షితం చేసుకోవాలని నాయకులు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిత్ ముదిరాజ్, అంబర్‌పేట మాజీ కౌన్సిలర్ దిడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీడీఓ హరి నందన్ రావు



**కల్హేర్, జూలై 24 (ప్రజా జ్యోతి):** సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం జెంలా తండాలో ఎంపీడీఓ హరి నందన్ రావు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గ్రామ సర్పంచ్ గోవింద్ నాయక్‌తో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామంలో చేపట్టనున్న కొత్త అభివృద్ధి పనులకు సంబంధించిన అంచనాలను సేకరించి, వాటి రూపకల్పనపై చర్చించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ హరి నందన్ రావు సూచించారు. అదేవిధంగా, చేపట్టే ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాభివృద్ధి పనులు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా పేద వితంతు మహిళలకు చీరలు పంపిణీ

### చేసిన ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం



జహీరాబాద్, జూలై 24 ( ప్రజా జ్యోతి న్యూస్ ) బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి వర్యులు కేటీఆర్ జన్మదినం సందర్భంగా వారికి హార్థిక జన్మదిన శుభాకాంక్షలు, తెలంగాణాలో రైతులు సమస్యల్లో ఉన్నారు. మరియు విద్యార్థులు తమకు జరిగిన అన్యాయం పై నిరసన వ్యక్తం చేస్తుంటే ప్రభుత్వం వారిపై ఉక్కుపాదం మోపుతూ అణిచి వేస్తున్నందున కేటీఆర్ తన పుట్టిన రోజును ఎవ్వరు నిర్వహించవద్దని ముఖ్యంగా కేక్ కటింగ్, ఫ్లెక్సీలు,అనవసరంగా హంగులు ఆర్భాటాలు చేయకుండా కేవలం సేవా కార్యక్రమాలు మాత్రమే చేయండని పిలుపు నిచ్చారు. దానిని అనుసరించి జహీరాబాద్ లో ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం ఆధ్వర్యంలో పేద వితంతు మహిళలకు చీరలను పంపిణీ చేయడం జరిగింది. కేటీఆర్ తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకో కుండా ఇందిరా పార్కు వద్ద యువత విద్యార్థులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది,అంతటి ప్రజాసమస్యలపై అవగాహన కలిగిన నాయకుడు కేటీఆర్ వారికి దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదించా లని ఆయన సేవలు తెలంగాణకు ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు శంకర్, స్వామిదాస్, ఈశ్వరప్ప, యస్.గోపాల్, యం.మల్లేశం, చెంగల్ జైపాల్, యండి.సలీమ్, హసన్ పర్వాన, రాజేందర్, పెంటన్న, అబ్దుల్ గఫార్, యస్.శ్రీనివాస్, హరీష్, పవన్ రాథోడ్, క్రిష్ణ పవార్, మేఘ నాథ్, రాజమ్మ, మంజుళ, చంద్రకళ, ఇంద్రమ్మ, పద్మావతీ, కిష్టమ్మ, రాచమ్మ, నిర్మల, అనుసుజ, రిజ్వాన, జి.గంగమ్మ, సూర్యకాంతం, తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో




చాంద్ పాషా అనే ఒక వ్యక్తి నేను సోషల్ మీడియా డిస్టిక్ స్టాఫ్ రిపోర్టర్ ని అంటూ జహీరాబాద్ లోని ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందికి వారి విధులు నిర్వహించనివ్వకుండా ఇబ్బంది పెడుతున్నటువంటి చాంద్ పాషా అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు

## మద్యం మత్తులో బీభత్సం.. జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు

**బైక్, కారును ఢీకొట్టిన కారు.. ఏడుగురికి తీవ్ర గాయాలు**



**అందోల్, జూలై 24, (ప్రజాజ్యోతి):** సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం రాంసాన్‌పల్లి సమీపంలోని 161వ జాతీయ రహదారిపై శుక్రవారం మద్యం మత్తులో కారు నడిపిన డ్రైవర్ సృష్టించిన బీభత్సంలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. అతివేగంగా వచ్చిన కారు ముందుగా బైక్‌ను ఢీకొట్టి, అనంతరం ముందు వెళ్తున్న మరో కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, సదాశివపేట మండలం పిల్లికుంట్ల గ్రామానికి చెందిన మల్లేశం మద్యం మత్తులో కారును అతివేగంగా నడుపుతూ కన్సాన్‌పల్లి సమీపంలో బైక్‌పై వెళ్తున్న బోడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన రవికుమార్, అతని కుమారుడు ధ్రువతేజతో పాటు సతీష్‌ను ఢీకొట్టాడు. అనంతరం కారును ఆపకుండా రాంసాన్‌పల్లి వద్ద ముందు వెళ్తున్న మరో కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు గాయపడగా, వారంతా టేక్మాల్ మండలం భర్దీపూర్ గ్రామంలో బంధువు అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, స్వప్న, పద్మ, శ్రీశైలం అక్కడ చికిత్స పొందుతున్నారు. నర్సింలు, కృష్ణ, విజయ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరంతా వికారాబాద్ జిల్లా మద్దికుంట గ్రామానికి చెందినవారిగా పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ మల్లేశంపై కేసు నమోదు చేసి, మద్యం సేవించి వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. స్థానికంగా ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది.

## ప్రజల భద్రతకు పెద్దపీట..

శిథిల విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన స్తంభాల ఏర్పాటు.



**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండలంలో నీ మల్కాపూర్ గ్రామం లోని 4, 12వార్డుల లోని గత కొన్ని సంవత్సరాలుగా శిథిలావస్థకు చేరుకుని ప్రజలకు ప్రమాదకరంగా మారిన పురాతన విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పగుళ్లు ఏర్పడి, వంగిపోయిన పాత విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలిపోతాయోనన్న ఆందోళనతో గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు సానుకూలంగా స్పందించి కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి సహకరించిన విద్యుత్ శాఖ అధికారులకు, గ్రామ సర్పంచ్‌కు, అలాగే సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన తోటి వార్డు సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ చర్య అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇకపై కూడా గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో అందరి సహకారంతో ముందుకు సాగాలని గ్రామ ప్రతినిధులు ఆకాంక్షించారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈవో బి. సురేష్






**కల్హే ర్. 23.జూలై. ప్రజా జ్యోతి** కల్హేర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) బి. సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, బోధనా విధానాలు, మధ్యాహ్న భోజన పథకం అమలును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడిన ఎంఈవో, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేలా కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో చేపడుతున్న విద్యా కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి పాల్గొన్నారు.

**వృత్త్యంతర శిక్షణా తరగతుల పరిశీలన**

కల్హేర్ మండలంలోని ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్త్యంతర శిక్షణా తరగతులను కూడా ఎంఈవో బి. సురేష్ పరిశీలించారు. శిక్షణా కార్యక్రమాల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, బోధనా అంశాల అమలును ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ లక్ష్మీప్రియ పాల్గొన్నారు.

## బోనాల వేడుకలకు ముస్తాబైన ఊరడమ్మ ఆలయం



**రాయికోడ్ జూలై 24 (ప్రజా జ్యోతి):** మండల కేంద్రమైన రాయికోడ్‌లో గ్రామదేవత శ్రీ ఊరడమ్మ బోనాల మహోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. రంగురంగుల విద్యుత్ కాంతులతో ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ భక్తులను ఆహ్లాదపరుస్తోంది. రేపు జరగనున్న బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు కలిసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బోనాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ పరిసరాలను శుభ్రపరిచి, విద్యుత్ అలంకరణలతో పండుగ శోభను తీసుకొచ్చారు. గ్రామ ప్రజలు సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

## విద్యార్థులకు మెరుగైన వసతులు..

**పరిశుభ్రత, నాణ్యమైన ఆహారంపై అధికారుల సంతృప్తి..**

**బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన తహసీల్దార్ అశోక్.**



**కొండాపూర్ ప్రజా జ్యోతి** తొగర్‌పల్లి బీసీ బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ అశోక్ ఎంఆర్ఐతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తనిఖీలో భాగంగా వసతి గృహ ప్రాంగణం పరిశుభ్రంగా ఉండటంతో పాటు నిర్వహణ కూడా సక్రమంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. విద్యార్థులకు భోజనం సిద్ధం చేసే వంటగది పరిశుభ్రంగా ఉండటంతో పాటు అన్ని ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న బియ్యం నాణ్యతను పరిశీలించగా మంచి ప్రమాణాలతో ఉన్నట్లు నిర్ధారించారు. వసతి గృహంలోని స్నానపు గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండటంతో పాటు వినియోగానికి అనువుగా నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు నివసిస్తున్న గదులు కూడా శుభ్రంగా, సౌకర్యవంతంగా ఉండటంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే విధంగా పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి వసతి గృహ నిర్వహణను కొనసాగించాలని సంబంధిత సిబ్బందికి తహసీల్దార్ సూచించారు.

## యూసుఫ్‌పూర్‌లో కరెంట్ షాక్‌తో యువకుడు మృతి



**రాయికోడ్ జూలై 24 (ప్రజా జ్యోతి):** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని యూసుఫ్‌పూర్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం చోటుచేసుకుంది.

మృతుడు మంగలి శ్రీనివాస్ (35) యూసుఫ్‌పూర్ గ్రామానికి చెందినవాడు. ప్రస్తుతం జహీరాబాద్‌లో నివాసముంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.

**ఫెన్సింగ్ వైర్ దాటే క్రమంలో ప్రమాదం**

ఉదయం కాలకృత్యాలకు వెళ్లిన శ్రీనివాస్ వ్యవసాయ భూమి వద్ద ఉన్న ఇనుప ఫెన్సింగ్ వైర్‌ను దాటే ప్రయత్నం చేశాడు. ఈ సమయంలో సమీపంలోని వ్యవసాయ భూమి నుంచి తెగిపడి ఫెన్సింగ్‌పై పడిన విద్యుత్ తీగను ప్రమాదవశాత్తు తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు.

**కేసు నమోదు**

మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయికోడ్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దర్యాప్తు కొనసాగుతోంది

ఈ ఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేపట్టిన పోలీసులు, ప్రమాదానికి గల పూర్తి కారణాలను వెలికితీసేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పుష్ప బ్రిడ్జిగా స్పెషల్ ఎట్రాక్షన్

**విశాఖపట్టణం :** సోషల్ మీడియా.. అదో నిరంతర ప్రవాహం. వింతల నుంచి విశేషాల వరకూ.. యుద్ధాల నుంచి సినిమాల వరకూ.. నిత్యం ఎన్నో పోస్టులు, వేలకొద్దీ వీడియోలు.. ఇక ఇందులో ప్రకృతి గురించి, ప్రకృతి అందాల గురించి ఎన్నో విశేషాలను షేర్ చేస్తుంటారు. అలా షేర్ చేసిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. చూడగానే వావ్ ఎక్కడిదీ స్పాట్ అని అనకుండా ఉండలేం.. దాని గురించి ఆరా తీసిన తర్వాత ఓసారైనా వెళ్లొద్దామని మనసు లాగడం ఖాయం. అలాంటిదే ఇప్పుడు చెప్పుకోబోయే బ్రిడ్జ్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని మోతుగూడెంలో ఉంది ఈ వంతెన. మోతుగూడె ఫోర్‌బే డ్యామ్ బ్రిడ్జ్ అని పిలుస్తారు.లోయర్ సీలేరు హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టులో భాగంగా మోతుగూడెం ఫోర్‌బే డ్యామ్ నిర్మించారు. చుట్టూ దట్టమైన అడవులు, కొండలు.. పచ్చదనం పరుచుకున్న వాతావరణం మధ్య ఉన్న ఈ డ్యామ్.. ప్రకృతి ప్రియులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రకృతి అందాలను చూసి సినిమా డైరెక్టర్లు కూడా ఇక్కడ షూటింగ్‌లు జరుపుతుంటారు. ఇక పుష్ప సినిమా షూటింగ్ తర్వాత.. మోతుగూడెం ఫోర్ బే డ్యామ్ బ్రిడ్జ్ కాస్తా..పుష్ప బ్రిడ్జ్‌గా పేరు తెచ్చుకుంది. పుష్ప సినిమాలోని కొన్ని సీన్లను ఇక్కడ చిత్రీకరించడంతో.. సినిమాతో పాటుగా ఈ ప్రాంతం కూడా బాగా పాపులర్ అయ్యింది. అప్పటి నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది.చుట్టూ లక్కవరం అటవీ ప్రాంతం, పచ్చని కొండల మధ్య సాగే మార్గం.. ఇక్కడ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. ఇక కరెంట్ ఉత్పత్తి తర్వాత డొంకరాయి డ్యామ్ నుంచి పవర్ కెనాల్ ద్వారా నీరు ఈ డ్యామ్‌లోకి చేరుతుంది. ఆ సమయంలో ఈ డ్యామ్ మరింత అందాన్ని సంతరించుకుంటుంది. ఇక ఈ ఫోర్ బే డ్యామ్‌కు కొద్ది దూరంలో పొల్లూరు వాటర్ ఫాల్స్ ఉన్నాయి. దీంతో ఈ రెండింటినీ కలిపి చూసేందుకు ఎక్కువమంది పర్యాటకులు వస్తుంటారు. అయితే నీటిని విడుదల చేసిన సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

**కరీంనగర్ :** కరీంనగర్ లోఎల్ నినో ప్రభావంతో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మిషన్ భగీరథతో పాటు ఇతర తాగునీటి సరఫరా వ్యవస్థల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలో రోజువారీ నీటి అవసరాలు, సరఫరా పరిస్థితులు, నీటి పొదుపు కోసం చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎక్కడైనా తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వార్డుల వారీగా పనిచేస్తున్న బోర్లు, వినియోగంలో లేని బోర్లను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.కార్పొరేషన్ పరిధిలోని కొత్తపల్లి-ఎలగందుల, బొమ్మకల్, విద్యారణ్యపురి, అలుగునూరు, చింతకుంట ప్రాంతాలతో పాటు ఇటీవల విలీనమైన గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండి మున్సిపాలిటీలు, గంగాధర, గన్నేరువరం మండలాల్లో నీటి అవసరాలు, వినియోగం, సరఫరా పరిస్థితులను సమీక్షించారు.ఎల్ఎండీ రిజర్వాయర్‌లో నీటి నిల్వలను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, డెడ్ స్టోరేజ్ పరిస్థితి ఏర్పడకముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గన్నేరువరం మండలంలోని హనుమాజిపల్లి జంగంపల్లి ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

## మీసేవ కేంద్రాలు ఇక డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లు

**-ఈడీఎం ఉదయ్ కుమార్**



సంగారెడ్డి, ప్రజాజ్యోతి జూలై 24: తెలంగాణ ప్రభుత్వం మీసేవ కేంద్రాలను డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లుగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించిందని, మెటా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ సహకారంతో ఈ కొత్త సేవలను అందుబాటులోకి తీసుకురానుందని ఈడీఎం ఉదయ కుమార్ తెలిపారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. చిన్న, మధ్య తరహా వ్యాపారులు తక్కువ ఖర్చుతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి డిజిటల్ వేదికల్లో తమ ఉత్పత్తులు, సేవలకు ప్రకటనలు ఇచ్చే అవకాశం పొందనున్నారు. దీంతో స్థానిక వ్యాపారాలకు డిజిటల్ మార్కెటింగ్ మరింత సులభతరం కానుంది.
అదేవిధంగా, మీసేవ కేంద్రాల నిర్వాహకులకు ఈ సేవల ద్వారా అదనపు ఆదాయ అవకాశాలు కూడా లభించనున్నాయి. రాష్ట్రంలో డిజిటల్ సేవల విస్తరణతో పాటు చిన్న వ్యాపారాలను ఆన్‌లైన్ మార్కెటింగ్ వైపు ప్రోత్సహించే వినూత్న కార్యక్రమంగా దీనిని ప్రభుత్వం పేర్కొందని అన్నారు.

## 85 జూలై 24న జరగాల్సిన ఓయూ పరిధిలోని అన్ని పరీక్షలు వాయిదా

**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 24, శుక్రవారం నాడు జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వడంతో వర్సిటీ అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.నీట్ యూజీ 2026 పేపర్ లీకేజీ వ్యవహారం, కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ వంటి వామపక్ష, కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బంద్‌కు పిలుపునిచ్చాయి. ఢిల్లీలో 'ఛలో పార్లమెంటు మార్చ్' నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని ఆరోపిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో, బంద్ కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యగా పరీక్షలను వాయిదా వేశారు. ఈ నిర్ణయం ఓయూ పరిధిలోని అన్ని అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో జేఎన్‌టీయూ-హైదరాబాద్ వంటి ఇతర విద్యాసంస్థలు కూడా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాయి.పరీక్షల వాయిదాతో విద్యార్థులకు తాత్కాలికంగా ఊరట లభించినప్పటికీ, అకడమిక్ క్యాలెండర్‌పై దీని ప్రభావం పడనుంది. వాయిదా పడిన పరీక్షల తదుపరి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని వర్సిటీ అధికారులు వెల్లడించారు.

## 20 ఏళ్లుగా అమెరికాలో ఉద్యోగం.. ఇంజినీర్‌పై తెలంగాణ ప్రభుత్వం విచారణ!

**హైదరాబాద్ :** తెలంగాణ రోడ్లు, భవనాల (ఆర్ అండ్ బి) శాఖలో పనిచేస్తున్న ఓ ఇంజినీర్, ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా దాదాపు రెండు దశాబ్దాలుగా అమెరికాలో ఉద్యోగం చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం, సదరు ఇంజినీర్‌పై క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించింది. శాఖాపరమైన రికార్డుల్లో ఇప్పటికీ ఉద్యోగిగా కొనసాగుతున్న ఆయనపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసింది.ఆర్ అండ్ బి శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్న సీహెచ్ రవి, 2006లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో తొలిసారిగా అమెరికా వెళ్లారు. అనంతరం 2011లో స్వల్ప కాలం పాటు తిరిగి వచ్చి, 2012లో మళ్లీ అమెరికాకు వెళ్లారు. అప్పటి నుంచి ఆయన విధులకు హాజరుకావడం లేదు. గత కొన్ని ఏళ్లుగా ఆయన వేతనం తీసుకోనప్పటికీ, ఆర్ అండ్ బి శాఖ అధికారిక రికార్డుల్లో ఆయన పేరు ఇప్పటికీ ఉద్యోగిగా కొనసాగుతుండటం గమనార్హం.ప్రభుత్వ సర్వీస్

## ప్రతి నీటి బొట్టు అమూల్యం

ప్రతి ఒక్కరూ నీటి పొదుపును జీవితంలో భాగం చేసుకోవాలి

మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్



**జహీరాబాద్ జూలై 24 (ప్రజా జ్యోతి న్యూస్)** మున్సిపల్ పరిధిలోని 25వ వార్డు డ్రైవర్స్ కాలనీలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ (గడ్డ)సమీపంలో నీటి పొదుపు నీటి సంరక్షణ పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ పాల్గొని ప్రజలకు నీటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ, జలమే జీవనానికి ఆధారం. నీరు లేకుండా మనిషి మనుగడ అసాధ్యం. ప్రకృతి మనకు ప్రసాదించిన అమూల్యమైన వనరులైన నీటిని వృథా చేయకుండా కాపాడు కోవడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత. ఈరోజు మనం పొదుపు చేసే ప్రతి నీటి బొట్టు రేపటి తరాలకు జీవనాధారంగా నిలుస్తుంది అని అన్నారు. ప్రజలు అవసరా నికి మించి నీటిని వాడకుండా జాగ్రత్త పడాలని, ఇంటి వద్ద నీటి పైపులు, ట్యాప్ల ద్వారా లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. వర్షపు నీటిని సేకరించే రైన్ వాటర్ హార్వెస్టింగ్ విధానాలను ప్రతి ఇంటిలో అమలు చేయాలని, భూగర్భ జలాల పరి రక్షణకు అందరూ సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ మాట్లాడుతూ, నీటివృధాను నివారించడం ద్వారా భవిష్యత్తు లో తాగునీటి సమస్యలను చాలావరకు తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి కుటుంబం నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటిస్తూ, పిల్లలకు కూడా నీటి విలువను తెలియజేయా లని సూచించారు. ప్రతి ఇంటికి నీరు అందిం చడం మా బాధ్యత, మంజీరా వాటర్ వచ్చే టప్పుడు సక్రమంగా వినియోగుంచుకోవాలా ని, వెంటనే ట్యాప్ లకు క్యాపులు అమర్చా లని తెలిపారు. నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ప్రభుత్వం చేపడుతున్న నీటి పరిరక్షణ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. నీటి వనరులను కాపాడు కోవడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కూడా పరిరక్షించవచ్చని పేర్కొన్నారు.ఈ అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు డిఈ మహేష్ , ఏఈ ఖాజా, మేనేజర్ శ్రీనివాస్, రవి, బస్వంత్ రెడ్డి, 25వ వార్డ్ కౌన్సిలర్ ఎండి జాకీర్, వార్డు నాయకులు, మహిళలు, యువత, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నీటి పొదుపు పై అవగాహన పెంపొందించు కున్నారు.

## పార్టీ మార్పు వార్తలపై మల్లారెడ్డి క్లారిటీ

**హైదరాబాద్ :** రాజకీయ వర్గాల్లో గత కొద్ది రోజులుగా తన పార్టీ మార్పుపై వస్తున్న ప్రచారానికి బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి చెక్ పెట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు వేడుకల్లో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్న ఆయన, తాను బీఆర్ఎస్‌ను వీడి వేరే పార్టీలోకి వెళ్తున్నానంటూ వస్తున్న వార్తలన్నీ కేవలం నిరాధారమైన ప్రచారమేనని స్పష్టం చేశారు.తాను పార్టీ మారుతున్నాననే రూమర్లను నిజమని నమ్మి ఒక అభిమాని తన సొంత రక్తంతో లేఖ రాయడం తనను ఎంతగానో కలచివేసిందని మల్లారెడ్డి తెలిపారు. త్వరలోనే ఆ అభిమానిని నేరుగా కలిసి మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కేటీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ... కేటీఆర్ 125 ఏళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి కేటీఆరే ముఖ్యమంత్రి కాబోతున్నారని, ఆయన్ను సీఎం పీఠంపై చూడటమే తన ప్రధాన